# నిత్య జీవితంలో తులసి

*వేదమూర్తి, తపోనిష్ఠ*

**పండిత శ్రీరామశర్మ ఆచార్య**

**మాణిక్య ప్రభువు**





# తులసి మహిమ

యుగ యుగాలుగా ప్రతి దేవాలయములో, ప్రతి తీర్థములో తులసికి ప్రత్యేక స్థానం ఇస్తూ వచ్చారు. షోడశోపచార పూజా విధానములో తులసికి విశిష్ట స్థానం ఉన్నది. నేడు విదేశీయులు సైతం తులసిలోని విశేషమును అంగీకరించుచున్నారు.

**'తులసి'** 24 గం.లూ ప్రాణవాయువును వదులుతూ ఉంటుంది. ఆ వాయువును పీల్చుట వలన 'యజ్ఞము' చేయగా వచ్చు ఫలితము వచ్చుచున్నది. కావున ప్రతి ఇంట్లో కనీసం 10 మొక్కలయినా పెంచి, వాతావరణ కాలుష్యాన్ని నివారించి, ఆరోగ్యాన్ని రక్షించుకొని, తులసి తీర్థం సేవించండి.

శాస్త్రములలో ఈ విధముగా చెప్పబడినది.

***త్రికాల వినతా పుత్ర ప్రయాశ తులసీ యది***
***విశిష్యతే కాయశుద్ధిశ్చాంద్రాయణ శతం వినా***
***తులసీ గంధమాదాయ యత్ర గచ్ఛతి మారుతః***
***దిశోదశశ్చ పూతాస్యుర్భూత గ్రామశ్చతుర్విధః॥***





భావం: త్రికాలములందు తులసిని సేవించినచో అనేక చాంద్రాయణ వ్రతములకంటే మిన్నగా శరీరశుద్ధియగును. తులసి యొక్క సువాసన వ్యాపించిఉన్న వాతావరణంలో నివసించు ప్రాణికోటి పవిత్రులు, నిర్వికారులు కాగలరు.

***తులస్యాం సకల దేవాః వసంతి సతతం యతః***
***అతస్తామర్చయేల్లోకః సర్వాన్దేవాన్ సమర్చయన్***

తా॥ తులసి మొక్క ఉన్న చోట త్రిమూర్తులు మొదలగు సర్వదేవతలు నివసింతురు.

***పుష్కరాద్యాని తీర్థాని గంగాద్యాః సరితస్తథా !***
***వాసుదేవాదయోదే వాస్తిష్ఠన్తి తులసీ దళే ॥***

తులసి దళములందు పుష్కరాది తీర్థములు,గంగ మొదలగు నదులు వాసుదేవాది దేవతలు నివసింతురు.

***రోపనాత్, పాలనాత్, సేవాత్, దర్శనాత్, స్పర్శనాన్నృణామ్***
***తులసీ దహ్యతే పాపం వాఙ్మనః కాయసంచితమ్ !***

ప్రాచీన కాలమున అమృత మథన సమయంలో సమస్త





ఓషధులు, భస్మములకు ముందుగా విష్ణువు సమస్త ప్రాణుల ఉపయోగార్థము తులసిని సృజించెను.

ప్రాచీన భారతీయ చికిత్స విధానములో అసామాన్యమైన చరక సంహితలో తులసి మొక్క గుణములు ఇట్లు వర్ణించబడినవి.

***హిక్కాజ విషశ్వాస పార్శ్వశూల వినాశినః***
***పిత్త కృతత్కఫవాతఘ్ను సురసః పూర్తి గంధహా॥***

తులసి (సురస) దగ్గు, విషవికారము, ఎక్కిళ్ళు, ప్రక్క టెముకలు నొప్పిని పోగొట్టును. దీని వలన పైత్యాధికము, దూషితకఫము, వాయువు నశించును. ఇది దుర్గంధములను కూడా పోగొట్టును.

భావ ప్రకాశమను వైద్య గ్రంథములో

***తులసీ కటుకాతిక్తా హృదయోష్ణా దాహిపిత్తకృత్***
***దీపనా కష్టకృచ్ఛ స్త్రాపార్శ్వ రుక కఫవాతజిత॥***

తులసి కటు, తిక్త హృదయములకు లాభసాటి. చర్మ రోగములలో సత్ఫలితమునిచ్చునది. జీర్ణ శక్తిని కలిగించునది. మూలశంకను పోగొట్టునది అని వర్ణించబడెను. ఆయుర్వేద శాస్త్రజ్ఞులు అన్ని

ఔషధులు, వనమూలికల గుణములు తెలుపునట్టి నిఘంటువును రచించి, అందు తులసి మొక్క గుణములు విస్తరించి వ్రాసిరి.

ధన్వంతరి నిఘంటువునందు:

***తులసీ లఘురుష్ణాచ్య రూక్ష కఫ వినాశినీ***
***క్రిమిదోషం నిహంత్యేషా రుచి కృద్వహ్నిదీపనీ॥***

తులసి కొద్దిపాటి వేడిని, రూక్షకఫదోషము, క్రిమి దోషములను హరించి వేడిని పుట్టించును.

రాజవల్లభ నిఘంటువు నందు :

***తులసీ పిత్తకృద్వాతా క్రిమీ దౌర్గంధనాశినీ***
***పార్శ్వశూలాంరతి శ్వాస కాసక్కవికాజిత్॥***

తులసి పైత్యసంబంధమైన, వాత, క్రిమి, దుర్గంధములను పోగొట్టును. ప్రక్కటెముకల నొప్పి, దగ్గు, శ్వాస, ఎక్కిళ్ళను నివారించును.

కైయదేవ నిఘంటువు నందు :

***తులసీ తురవా తిక్తా తీక్ష్ణోష్ణా కటుపాకినీ***
***రుక్షా, హృద్యాలఘుః కటుచౌదాహపితాగ్ని వర్ధినీ॥***





***జయేద వాత, కఫ శ్వాసాకారుహిద్మావమి కృమనీన***
***దౌర్గంధ్య పార్శ్వశూల కుష్ఠ విషకృచ్ఛున స్రాదృగ్గధః***

తులసి తీక్షణ, కటు, కఫ, దగ్గు, ఎక్కిళ్ళు, క్రిమి దుర్గంధము, పార్శ్వశూల, కుష్ఠు, కంటి జబ్బులు, వాంతులు మొదలగువాటిని పోగొట్టును.

## జ్వర చికిత్సలు

1. పడిసెము వలన జ్వరము వచ్చినపుడు తులసి ఆకుల రసమును సేవించవలెను.
2. మలేరియాకు 55 గ్రా. తులసి ఆకులు, 28 గ్రా. మిరియాలు మెత్తగా నూరి మాత్రలుగా చేసి 3 గంటల కొకసారి రెండు మాత్రల చొప్పున నీటితో సేవించవలెను.
3. తులసి ఆకులు 11, మిరియాలు 3 గ్రా., వాము 3 గ్రా, శొంఠి 3 గ్రా.లు నూరి నీళ్ళతో కలిపి శుభ్రమైన మట్టిపాత్రలో పోసి కాచి వేడిచేసి దాని ఆవిరిని రోగి శరీరమునకు తగులనీయవలెను. ఆ మిశ్రమము ఉడుకుచుండగా అందు





సైంధవ లవణమును కలిపి త్రాగవచ్చును. దీని వలన అన్ని రకముల జ్వరములు నయమగును.

4. మంద జ్వరములకు పుదీన, తులసి ఆకుల రసం ఒక్కొక్కటి 10 గ్రా. తీసుకొని దానికి 5 గ్రా. పటికబెల్లము కలిపి సేవించవలెను.
5. శీత జ్వరములకు తులసి ఆకులు, పుదీనా, అల్లం, 5 గ్రా. చొ॥న తీసుకొని కషాయము చేసి త్రాగవలెను.
6. విష జ్వరములకు తులసిఆకులు, నల్లములగ ఆకులను కలిపి నూరి ఆ చూర్ణమును గోరువెచ్చని నీటితో సేవించవలెను.
7. 10 గ్రా. తులసి ఆకుల రసమును సేవించిన పురాతన విష జ్వరములు నయమగును.
8. 11 గ్రా. తులసి ఆకుల, 11 గ్రా.మిరియాలు, 11 గ్రా. కాకరాకులు, 44 గ్రా.గుంటకలగర కలిపి నూరి బటాణీ గింజంత మాత్రలు కట్టి, ఎండబెట్టి, ఆ మాత్రలను ఉదయము, సాయంకాలము రెండేసి చొప్పున చల్లటినీటితో సేవించిన





పడిసెముతో వచ్చు జ్వరము నయమగును. ఆరోగ్యవంతులు కూడా మలేరియా కాలములో ఒకమాత్ర చొప్పున ఉదయము సేవించిన మలేరియా రాదు. ఈ మాత్రలు రెండు నెలల వరకు మాత్రమే పనిచేయును.

9. తులసి ఆకులు, పొద్దుతిరుగుడు ఆకులు నీళ్ళతో నూరి వడకట్టి త్రాగిన సకల జ్వరములు నయమగును.
10. కఫ జ్వరములలో తులసి ఆకులు, నాగరమోథా, శొంఠి సమానంగా నూరి, కషాయం కాచి సేవించవలెను.
11. రెండు చిన్న పిప్పళ్ళు నూరి, తులసి ఆకు రసం,తేనె కలిపి సేవించిన దీర్ఘకాలిక జ్వరము నయమగును.
12. తులసి ఆకులు, వేపచెక్క రసం సమానముగా తీసికొని కొన్ని మిరియాలతో గోరువెచ్చని నీటితో సేవించిన, పంటల కోతల సమయములో వచ్చు జ్వరము నయమగును.
13. కొద్ది తులసి ఆకుల కషాయములో పాలు, పటిక బెల్లం వేసి త్రాగిన సామాన్య పడిసెము నయమగును. బజారులో అమ్మబడు టీ కంటే ఈ కషాయము చాలా శ్రేష్ఠము.

## దగ్గు, పడిసెము

చరక సంహితయందు దగ్గునకు పుట్టతేనెతో తులసి రసము కలిపి సేవించిన ఎక్కువ లాభదాయకమని చెప్పబడినది. (చికిత్స స్థాన్ అ. 58 – 78) ఉబ్బసము నయము చేయుటలో తులసి శ్రేష్ఠమని చెప్పబడినది.

1. సాధారణ దగ్గుకు తులసి ఆకుల రసం, అడ్డసరం ఆకుల రసము సమముగా సేవించవలెను.
2. కోరింత దగ్గుకు లేతతులసికొమ్మ లేక ఆకులు అల్లంతో నూరి, తేనెతో సేవించిన నయమగును.
3. తులసి గింజలు, తిప్పతీగె, శొంఠి, వాకుడువేరు సమభాగములుగా నూరి జల్లించి అందు కొద్దిపాటి చూర్ణమును. 75 గ్రా. కొంచెము తేనెతో కలిపి సేవించిన దగ్గు నయమగును.
4. లేత తులసి ఆకులు గజ పిప్పళ్ళు 5 గ్రా. చొ ॥న పటికబెల్లం 22 గ్రా. ఒక శేరు (లీటరు) నీళ్ళలో సగము అగు వరకు మరగించి తర్వాత వడకట్టి 60 మి.లీ. చొప్పున పలుసార్లు సేవించిన కోరింత దగ్గు నయమగును.





5. చిన్న పిల్లల దగ్గు కొద్దిగా తులసి ఆకులు, 1 గ్రా. సైంధవలవణం, 0.5 గ్రా. అతావసలను తేనెతో కలిపి తల్లిపాలతో ఇచ్చిన తగ్గును.
6. తులసి ఆకుల రసము, అతిమధురం, సత్తు కలిపి తాగినచో దగ్గు నయమగును.
7. తులసి, కసివెంద ఆకుల రసము కలిపి త్రాగినా కూడా దగ్గు తగ్గును.
8. పొడి దగ్గుతో గొంతుక ఆర్చుకొనిపోయినప్పుడు తులసిఆకులు, వట్టివేళ్ళు అతిమధురం నూరి సమభాగములు చేసి, పటిక బెల్లమును కలిపి గోరువెచ్చని నీటితో సేవించవలెను.
9. తులసి ఆకులు 5 గ్రా., గోధుమ పొట్టు 11 గ్రా., అతి మధురం 5 గ్రా పావుశేరు (పావులీటరు) నీళ్ళలో మరిగించి సగము అగువరకు కాచి వడకట్టి పటికబెల్లం చూర్ణంతో సేవించిన దగ్గు వెంటనే నయమగును.
10. 4,5 లవంగములు వేయించి తులసి ఆకులతో సేవించిన అన్ని రకముల దగ్గులు వెంటనే నయమగును.





11. తులసి ఆకులు, పసుపు, మిరియములతో తగు రీతిలో తయారైన కషాయము సేవించిన జలుబు నయమగును.

## కన్ను, ముక్కు, చెవి రోగములు

ఇంద్రియములలో ఈ మూడును ప్రధానమైనవి. వీటి రోగ నివారణకు తీవ్రమైన మందులు వాడుట మంచిది కాదు. తులసి వంటి ఆపదలేని ఓషధుల వాడుకచే ఈ అవయవముల రోగములు నయమగును.

*గోరవే, శిరసే, శూలే, పీనసే, అర్థభేదకే*
*క్రిమీ వ్యాధాపవస్మారే ఘ్రాణనాశే ప్రపోహికే ॥*

భావం:– తులసిని వాడుట వలన తలలో ఉండు దోషములు పోయి తలబరువు, తలనొప్పి, పీనస, పార్శ్వనొప్పి, క్రిమి, అపస్మారము, వాసనశక్తి నశించుట మొదలగునవి నయమగును.

1. తులసి గింజలు 3 గ్రా. ,రసాంజనము 3 గ్రా., అమా పసుపు 3 గ్రా., నల్లమందు 0.5 గ్రా., గుబార్ పప్పులో కలిపి నూరవలెను. దీనిని కండ్లకు చుట్టునూ పూసినచో పోటు, ఎరుపు తగ్గును.





2. తులసి ఆకులరసం కంటిలో పోసినచో కండ్ల బాధలు నయమగును. తులసి రసములో కొద్దిగా మంచితేనె కలిపి సీసాలో ఉంచుకొని చుక్కల మందువలె వాడవచ్చును.
3. కండ్లలో పోటు, దురద ఉన్నచో తులసి ఆకుల కషాయములో కొద్దిగా పటిక అరగదీసి దానిని గోరు వెచ్చగా చేసి దూదిని అందులో తడిపి కనురెప్పలపై అద్దవలెను. 5 నిమిషములలో రెండు పర్యాయములు అట్లు చేసినచో కండ్లు శుభ్రపడును.
4. చెవి పోటుకు, శ్రవణ శక్తి సరిగాలేనపుడు తులసి ఆకు రసమును గోరువెచ్చగా వేడిచేసి 2,3 చుక్కలు చెవిలో పోసిన ఉపశమనము నిచ్చును. చీము, రసి కారుతూ వాసన వచ్చుచున్నచోప్రతి రోజు పై విధముగా రసము వేయుచుండవలెను.
5. తులసి ఆకులు, ఆవాల నూనె సన్న మంటపై వెచ్చచేసి, ఆకులు ఉడికిన తరువాత వడకట్టి రెండు మూడు చుక్కలు చెవిలో పోసిన పోటు తగ్గును.
6. ముక్కులో దురద, పోటుగా ఉండి పుండుపడుట, దెబ్బతగులుట జరిగినచో తులసి ఆకులను బాగా నూరి వాసన చూచినచో తగ్గును.

7. ముక్కులో పీసనరోగము వచ్చి పురుగులు చేరి దుర్వాసన ఉన్నచో తులసి ఆకుల రసంలో కర్పూరం వేసి వాసన చూచిన తగ్గును.

## వీర్యవృద్ధి, మూత్రరోగములు

తులసి గింజలు నూరిన జిగురుగా, పూయుటకు వీలుగా ఉండి, మూత్రనాళములోని వికారములకు ఉపయోగపడును. తులసి వేరుకు వీర్యస్తంభన శక్తి కలదు. కనుక వీటిని బెల్లముతో కలిపి తిని, నీటిలో రంగరించి త్రాగుదురు. అట్లే తులసి ఆకులు వీర్యదోషములను పోగొట్టును.

1. తులసి వేరును మెత్తగానూరి తాంబూలములో కాచువలె వేసుకొని తినినచో వీర్య పుష్టి, స్తంభన కలుగును.
2. తులసి గింజలుగాని, వేరు యొక్క చూర్ణమును కాని పాతబెల్లముతో కలిపి 4.5 గ్రా. ప్రతిరోజూ పాలతో సేవించినచో పురుషత్వము వృద్ధిచెందును.
3. తులసి గింజలు 33 గ్రా., నేలతాడి 44 గ్రా., పటికబెల్లము 44 గ్రా. నూరి కలుపవలెను. దీనిని ప్రతిరోజూ ఆవుపాలతో 4.5 గ్రా. సేవించిన వీర్య సంబంధమైన దుర్బలత పోవును.





4. మూత్రదాహ రోగమునకు తులసి గింజలు, యాలుకుల గింజలు, నూరేకారం సమభాగములుగా కలిపి నూరవలెను. ఈ చూర్ణమును 0.5 గ్రా. తిని, రెట్టింపు నీళ్ళు కలిపిన పాలను త్రాగగలిగినంత త్రాగిన మంచి గుణమిచ్చును. ఇందు పంచదార మొదలైనవి కలుపరాదు.
5. కొరకు సవాయిలో తులసి గింజలను నీటిలో నూరి ముద్దగా చేసి అందు వేపరసము రెట్టింపు పోసి కాచవలెను. అది నల్లగా అవగానే వడపోసి చల్లార్చవలెను. దానిని పుండ్లమీద రాయవలెను. అన్ని పుండ్లకు వాడవచ్చును.
6. మూత్ర దాహములో పావుశేరు పాలు, పావుశేరు నీరు కలిపి, అందు 25 గ్రా.ల తులసి ఆకుల రసమును కలిపి త్రాగవలెను.
7. 6 గ్రా. తులసి గింజలు పావుసేరు నీళ్ళలో రాత్రిపూట నానబెట్టి, ఉదయం వాటిని తినినచో ప్రమేహధాతుక్షీణత, మూత్రకృచ్ఛము తగ్గును.

## స్త్రీల ప్రత్యేక రోగములు

తులసి గింజలలో పూయుటకు అనువగు జిగురు, గుణము





కలదు. ఇది పురుష జననేంద్రియ రోగములందు లాభ దాయకమని నిరూపించబడినది. తులసి అందువల్లనే కథలలో శ్రీ విష్ణుప్రియ అని స్త్రీ వాచకములో చెప్పబడింది.

1. స్త్రీల ఋతుక్రమము ఆగినప్పుడు తులసి (ఆకులు) కొమ్మలు, విత్తనములు, కాడ, వేరు, వీటి గుజ్జు, శొంఠి,వేప చెక్కరసం, వాము, తాలీస్ ఆకుల ముద్ద 11 గ్రా. తీసికొని పావుశేరు నీళ్ళలో మరిగించి నాల్గవ వంతుకు వచ్చాక దింపి వడకట్టి కొంతకాలము త్రాగినచో కుదుటపడును.
2. స్త్రీలు బయట ఉన్నప్పుడు తులసి ఆకుల కషాయం మూడు రోజులపాటు త్రాగుచుండిన హాని కలుగనివిధముగా గర్భనిరోధము కలిగించును. ఇది వారికి శుద్ధమైనది, దోషరహితమైనది, పుష్టికరము కూడా.
3. గర్భిణీ స్త్రీల కడుపు, ఛాతి దురదగా ఉన్నచో వన తులసి బీజముల లేపనముచే నయమగును.
4. తులసి ఆకుల రసంతో జీలకర్ర నూరి ఆవుయొక్క గుమ్మపాలతో సేవించిన గర్భాశయరోగములు మాయమై స్వస్థత లభించును.





5. ప్రసవవేదనలో నొప్పులు తీవ్రమైనపుడు 10 గ్రా. తులసి ఆకుల రసం త్రాగినచో సుఖప్రసవమగును. తులసి వేరును నడుముకు కట్టిఉంచిన సుఖప్రసవమగును.
6. పళ్ళు వచ్చు సమయములో పిల్లలకు నీళ్ళ విరేచనము లగుచుండును. తులసి ఆకుల చూర్ణమును దానిమ్మ పానకముతో కలిపి ఇచ్చిన అవి తగ్గిపోవును.

## ఉదర రోగములు

1. తులసి తాజా ఆకులను 11 గ్రా. ఉదయం సేవించిన అజీర్ణము తగ్గును.
2. తులసి యొక్క ఆకులు, కొమ్మలు, కాడ, విత్తనములు, వేర్లను కషాయము కాచి త్రాగుటచే నీళ్ళ విరేచనములు కట్టి జీర్ణశక్తి వృద్ధిపొందును.
3. పైకషాయములో జాజికాయ చూర్ణమును కలిపి త్రాగినచో నీళ్ళ విరేచనముల వలన కలుగు అతి నీరసము త్వరగా పోవును.
4. తులసి, అల్లం రసం కలిపి ఒక్కొక్క చెంచా చొప్పున 4 సార్లు త్రాగిన కడుపు నొప్పి తగ్గును.

5. తులసి 11 ఆకులు, 1.5 గ్రా. వాయు విడంగములతో నూరి ఉదయం, సాయంత్రం స్వచ్ఛమైన నీటితో కలిపి త్రాగిన నులిపురుగులు నశించును.

6. తులసి, సహజ ఆకులు చటాకు రసములో కొంచెము సైంధవ లవణము కలిపి సేవించిన ఆకలి మాంద్యము తగ్గి విరేచనము సాఫీగా అగును.

7. ఎండు తులసి ఆకులు, శొంఠి, బెల్లం కలిపి పెద్దమాత్రలు చేసి సేవించిన నీళ్ళ విరేచనములు తగ్గును.

8. ఎండు తులసి ఆకుల చూర్ణము 1.5 గ్రా., సబ్జా గింజలు 4.5 గ్రా. కలిపి పెరుగుతో సేవించిన నీళ్ళ విరేచనములు తగ్గును.

## పుండ్లు, గాయములు, చర్మరోగములు

తులసిలో శుద్ధి చేయుగుణము కలదు. ఆధునిక పరిశోధనలలో తెలిసినదేమిటంటే తులసిలో గల సువాసనకు క్రిమినాశకశక్తి గలదు. చరక సంహితలో విష చికిత్సకు చాలా చోట్ల తులసిలో గల విషహారి





గుణము సూచింపబడెను. కందిరీగ, తేలు కుట్టినప్పుడు తులసి ఆకుల ఉపయోగము చెప్పబడెను. గాయములపై ఎండు తులసి ఆకుల పొడుమును చల్లిన మలినములు చేరకుండా పుండు నయమగును. తామర, గజ్జి మొ॥ చర్మరోగములలో కషాయముతో కడిగిన లాభదాయకము. చర్మరోగనివారణలో తులసి యొక్క శక్తి అధికము. గాయములు, పుండ్లపైన తులసి బాగా ఉపయోగపడును. తులసి యొక్క గంధమును పూసిన తగ్గును. తులసి కషాయము వలన కూడా నయమగును. ఎండు తులసి ఆకుల చూర్ణమును చల్లిన శీఘ్రముగా నయమగును.

1. తులసి ఆకులను నిమ్మరసముతో నూరి పట్టించినచో తామర నయమగును.

2. తులసి రసం 2 పాళ్ళు, నువ్వుల నూనె 1 పాలు కలిపి సన్నని సెగపై కాచి వడపోసి వాడిన దురద మొదలగు అన్ని చర్మరోగములు నయమగును.

3. కాచిన తులసిరసం, కొబ్బరినూనె కలిపి పట్టించిన కాలిన గాయాల మంట తగ్గును.





4. తులసి ఆకులను గంగాజలముతో నూరి నిరంతరము రాసిన, తెల్లమచ్చలు నయమగును.

5. తులసి ఆకులు, లేత రావి చిగుళ్ళు నూరి పట్టించిన వెంట్రుకలు రాలుట తగ్గును.

6. ముక్కులో పుండుకు తులసి ఆకులు, రేగుపండును నూరి పట్టించినను, వాసన చూసినను గుణమిచ్చును.

7. కడుపులో పుండు గుల్మములకు తులసి ఆకులు సోయా కషాయమును తీసి కొద్దిగా సైంధవ లవణమును కలిపి త్రాగవలెను.

8. తులసి ఆకులు, పటిక చూర్ణముచేసి గాయములపై పూసిన అవి త్వరగా తయమగును.

9. చంకలో కురుపులు తులసి ఆకులు, ఆవాలు బెల్లం, గుగ్గిలము సమముగా నీళ్ళలో నూరి వేడిచేసి కట్టుకట్టినచో పగిలి నయమగును.

10. 20,25 తులముల తులసి ఆకులను నూరి నీటిని కలిపి రసం





తీసి అర్ధసేరు నీళ్ళు, నువ్వులనూనెను కలిపి, నీరు ఇగురువరకు మరిగించవలెను. నూనెను వడపోసి, సీసాలో పోసి కొద్దికొద్దిగా ఒంటికి మర్దన చేసినచో దురద, గజ్జి నయమగును. పై తైలముతోపాటు ఉదయమున తులసివేరు, శొంఠి చూర్ణము గోరువెచ్చని నీటితో త్రాగిన కుష్ఠువంటి భయంకరరోగములు నయమగును. తీవ్రమైన కుష్ఠురోగికి తులసి రసమును ఇచ్చి నయము చేసినట్లు ఒక ప్రసిద్ధ వైద్యుడు చెప్పెను.

11. తులసిలో రక్తశుద్ధి చేయు గుణము కలదు. కనుక అన్ని రకముల రక్తదోష రోగాలైన పుండ్లు, గాయములు, చర్మముపై ఎర్రని దద్దుర్లను కూడా నయముచేయును. ఒక రాగి పాత్రలో అర్ధపావు (125 మి .లీ ) నిమ్మరసములో తులసి, నల్లకసివెంద రసము కూడా అంతే కలుపవలెను. పాత్రను ఎండలో ఉంచుటచే ఎండును. బాగా ఎండి చిక్కబడగానే ముఖముపై రాయగా ముఖముపై నల్లమచ్చలు పోయి శుభ్రముగాను అందముగాను అగును. ఇట్లు అనేక సార్లు రాయుటచే శరీరమున ఏ భాగమున ఉన్న నల్లమచ్చలయినా నయమగును.

12. తులసి ఆకుల రసము నిమ్మరసముతో నూరి రాసినచో తామర పూర్తిగా నయం అగును.

13. తులసి, వేపాకులను పెరుగుతో నూరి రాసినను తామర పోవును.

## పిల్లల రోగములు

చిన్న పిల్లల రోగములకు తులసి నిరపాయము, సౌమ్యమైన ఔషధము. జ్వరము, దగ్గు, పాలు కక్కుట, మొదలైన రోగములు త్వరగా ఉపశమించును.

1. చిన్న పిల్లల స్ఫోటకము తులసి కొమ్మ, వాము, అల్లం సమభాగములుగా నూరి అనేకసార్లు సేవించిన తగ్గును.

2. స్ఫోటక జ్వరము తులసి ఆకులు 11 గ్రా., మెంతులు, 11 గ్రా., కూట్ అమాషా అర్థపావుసేరు (125 మి.లీ.) నీళ్ళలో కాచి వడకట్టి త్రాగించిన నయమగును.

3. జలుబు, దగ్గు వచ్చినపుడు తులసి ఆకుల రసం, అల్లం 33 గ్రా. చొ॥న మరిగించి 28 గ్రా. తేనె కలిపి సీసాలో ఉంచవలెను. 30 నుండి 60 చుక్కల చొప్పున రోజుకు 3 పర్యాయములు సేవించిన బాగుపడును.





4. తులసి ఆకులు, తుమ్మ చెక్కలు, వాము ఒక్కొక్క తులము చొప్పున ఒక చటాకు నీళ్ళలో కాచి నాల్గవ వంతు మిగులునట్లు చేసి వడపోసి త్రాగించిన అన్ని జ్వరములు నయమగును.

5. పిల్లల కడుపు ఉబ్బరము తులసి రసమును 3 గ్రా. లు త్రాగించిన నయమగును.

## మస్తిష్కము, స్నాయువుల రోగములు

మస్తిష్కము, జ్ఞాననాడుల ప్రక్రియ అత్యంత సున్నితమైనది. అందేభాగము చెడినను తల తిరుగును. జ్ఞాపకశక్తి తగ్గుట,మందము, మూర్ఛ, ఉన్మాదము, అపస్మారము మొదలగు భయంకర రోగములు కలుగును. వాటి చికిత్స కూడా కష్టతరమే. వైద్యులు తాత్కాలిక ఉపశమనమునకు తీవ్ర ఔషధములను ఉపయోగించినను, అవి చివరకు మెదడును పూర్తిగా నష్టపరచిపాడు చేయును. ఇట్టి అవస్థలో తులసి అత్యంత సూక్ష్మ ప్రభావశక్తి గల దివ్యౌషధములన్నిటి కన్న ఎక్కువ ప్రభావము చూపును, 'తులసి కవచం'లో చెప్పినట్లు తులసి భక్తిపూర్వకముగా ప్రసాదముగా భావించి తీసికొనినచో, దాని





ప్రభావము మన జ్ఞానేంద్రియములపై పడి మేలుచేయును. మస్తిష్కము, కండ్లు, చెవులు, ముక్కు, నాలుక కంఠ దోషములను పోగొట్టును.

1. ఆరోగ్యంగా ఉన్న మనిషి కూడా రోజూ 10 తులసి ఆకులను, 4,5 మిరియాలను నూరి వడకట్టి త్రాగుచుండినచో మెదడు చురుకుగా పనిచేయును. అవసరమైనచో 3,4 బాదం పప్పులను తేనెను కలిపి తినవచ్చును.

2. ఉదయము స్నానమైన వెంటనే 4,5 తులసి ఆకులను నీటితో మ్రింగినచో స్మరణశక్తి, మేధాశక్తి వృద్ధి పొందును.

3. తులసి ఆకులు, సరస్వతి, ఆకులు నూరి వడకట్టి ఒక గ్లాసు నిత్యము త్రాగుచూ ఉండిన మెదడు యొక్క దుర్బలత, ఉన్మాదము తగ్గును.

4. తులసి ఆకుల రసములో కొద్ది ఉప్పు వేసి ముక్కులో ఒకటి రెండు చుక్కలు వేసినచో మూర్ఛ తొలగును.

5. తులసి శ్రద్ధగా, నియమముగా వాడినచో జ్ఞానేంద్రియముల శక్తి పెంపొందును.





## పంటిపోటు

1. తులసి ఆకులను, మిరియపు గింజలను నూరి మాత్రలుగా చేసి పంటిపై పెట్టినచో పోటు తగ్గును.

2. తులసి పంచాంగము (ఆకులు, కొమ్మ, కాండము, వేరు, బెరడు)లను అంతులము నూరి, అర్థశేరు నీళ్ళలో మరగబెట్టి, సగము వరకు మిగులునట్లు కాచి పుక్కిలించినచో పన్నుపోటు తగ్గును.

## తలనొప్పి

1. ఎండు తులసి ఆకుల చూర్ణము లేక విత్తనములను నూరి గుడ్డలో ఉంచి వాసన చూచినచో విశ్రాంతి కలుగును.

2. తులసి ఆకులు, 35 తెల్లమిరియాలు, 1 తురిమ 10 గ్రా. నీటితో నూరి, రసము తీసి, నిత్యము త్రాగినచో పాత తలనొప్పి తగ్గును.

3. తులసిఆకులు, మిరియపు గింజలు నూరి, రసము తీసి పీల్చినచో పార్శ్వపునొప్పి పోవును.

4. వన తులసి పూలు, మిరియపు గింజలను కాలుతున్న కొరకంచుపై ఉంచి దానిని వాసన చూచిన, తీవ్రమైన తలనొప్పి తగ్గును.

5. నల్ల తులసి వేరును గంధము తీసి నుదుటిపై రాసిన తలనొప్పి తగ్గును.

## కీళ్ళవాతము, మోకాళ్ళ నొప్పులు

తులసికి వాతదోషమును పోగొట్టు గుణము కలదు. వాత ప్రకోపముచే నాడులలో కలుగు బాధకు తులసి కషాయము మంచి ఉపకారి. తులసి రసము త్రాగుచుండినచో మోకాళ్ళ నొప్పులు తగ్గును.

బెణుకులు, దెబ్బలకు తులసి రసమును పూయవలెను.

1. తులసి వేరు, ఆకులు, కొమ్మ, గింజలు బెరడు ఈ ఐదింటిని సమానముగా తీసికొని,నూరి వడకట్టి 11 గ్రా. చొ॥న అంతే తూకముగల బెల్లముతో కలుపవలెను. ఉదయం, సాయంత్రం మేకపాలతో సేవించిన కీళ్ళవాతము నయమగును.

2. తులసి పంచాగములను నీటితో మరగబెట్టి ఆవిరి పట్టినచో కీళ్ళవాతము నయమగును.





## వివిధ రోగములు

1. నల్లమందు, ఉమ్మెత్త (ముషిణి) మొదలగు వాటి విషమును పోగొట్టుటకు తులసి ఆకులను ఆవునేతితో నూరి సేవించవలెను. ఇట్లు చాలాసార్లు వాడవలెను.

2. దాహరోగమునకు తులసి ఆకుల రసములో నిమ్మరసం,పటికబెల్లపు చూర్ణము కలిపి షర్బత్ చేసి త్రాగవలెను.

3. భోజనము చేసిన ఒక గంట తర్వాత తులసి ఆకులు 4,5 నమిలిన నోటి దుర్గంధము పోవును.

4. తులసి ఆకులు హుర్‌హుర్, ఆమర్ బేల్,ఒంటె మేంగని వీటిని గోమూత్రంతో ఉడకబెట్టి నూరి అంగముపై పట్టించిన వాపు తగ్గును.

5. వన తులసి కొమ్మలున్న చోట నల్లులు, దోమలు, ఈగలు మొదలగు కీటకములు రావు.

6. ఛాతి, పొట్ట పేగులలో మంట ఉన్నచో తులసి ఆకులు, దేవదారు చెక్క కలిపి నూరి గంధముగా చేసి పూసిన నయమగును.

7. మెడనొప్పికి తులసి ఆకుల రసము తేనెతో కలిపి నాకవలెను.





8. మలబద్ధకమునకు ఎండు తులసి ఆకులు ఒక వంతు, నల్ల ఉప్పు ఒక వంతు, అర్ధపావుసేరు (125 మి.లీ) పెరుగుతో కలిపి తినవలెను.

9. మూలశంకకు తులసి వేరు, వేప గింజలు సమపాళ్ళుగా తీసికొని నూరి పొడుము చేయవలెను. దీనిని రోజూ మజ్జిగతో సేవించవలెను.

10. దేహములో పైత్యము ఎక్కువైనచో తులసీ గింజలు, 2 మాషలు ఉసిరి మురబ్బాతో కలిపి సేవించవలెను.

11. కలరాలో తులసి ఆకుల, గింజల పొడి, వేపచెక్క, ఉత్తరేణి గింజల చూర్ణము, తిప్పతీగ, వెర్రిపుచ్చ వీటిని కలిపి 20 నుండి 30 గ్రా.ను 3 పావుసేర్ల (750 మి.లీ.) నీటితో మరిగించి సగము మిగులునట్లు చేసి 30 గ్రా. చొ॥న వెంటవెంటనే సేవించవలెను.

## పాముకాటుకు చికిత్స

1. మధ్యప్రదేశ్‌లోని కొండజాతి వారు తులసి ఆకులను నూరి వెన్నతో కలిపి పూయుచుందురు. ఆ లేపము నల్లబడినచో దానిని





తీసి, మరల లేపము పూయవలెను. లేదా గుప్పెడు తులసి ఆకులను నములునట్లు చేయవలెను.

2. స్త్రీకి పాము కరచినచో, తులసి ఆకుల రసము, అరటిబోదె రసమును కలిపి నెత్తిమీద, ఛాతిమీద పూయవలెను. 22 గ్రా. రసము త్రాగించవలెను. ఇట్లు 5 నుండి 10 నిమిషముల కొకసారి చేయుచుండవలెను. చివరకు 6,7 గంటలకు స్పృహ వచ్చును. 24 గంటలకు పూర్తిగా నయమగును. (రామకృష్ణ మిషన్ వారి చికిత్స )

3. పాముకాటుకు బుబయీ, తులసి గింజలను నమలవలెను. లేదా కొంత నమిలి మరికొంత కుట్టినచోట రాయవలెను. ఆకులరసం 55 గ్రా. త్రాగించిన శీఘ్రముగా నయమగును.

# తులసీ కవచము

కవచమనగా పూర్తి స్తోత్రము, తులసిలో లీనమై, ముందు శక్తిని దేవతగా భావించి, ఆపాదమస్తకము రక్షించుటకు. ఆరోగ్యవంతముగాను, కార్యదక్షునిగాను చేయుటకు ప్రార్థించవలెను. తులసి యొక్క దైవీ విభూతిని ఆరోగ్యమునకు, క్షేమమునకు

ప్రార్థించినచో, ఆస్తుతి వలన ఆత్మ సంకేత శక్తి కలుగును. బ్రహ్మాండ పురాణమున తులసి మహాత్మ్యములో ఇట్లు చెప్పబడెను.

*"తులసీ శ్రీమహాదేవి నమః పంకజ ధారణీ*
*శిరోమే తులసీ పాతు సాలం పాతు యశస్వినీ*
*దృశోమే పద్మనయనా శ్రీ సఖీ శ్రవణౌమమ*
*ఘ్రాణం పాతు సుగంధమే నఖంచ సుముఖీ మమ"*

'కమలమును ధరించు ఓ తులసీ మాతా ! నీకు భక్తిపూర్వకముగా నమస్కరించుచున్నాను. తులసీ రూపములో శిరస్సును రక్షింపుము. పద్మనయన నామముతో నా నేత్రములను, శ్రీ సఖీ నామమున చెవులను, గంధం అనే పేరున ముక్కును సుముఖియను పేరున ముఖమునూ రక్షింపుము'.

*"జిహ్వాం పాతు శుభదా కంఠ విద్యామయో మమ*
*స్కంధౌ కల్హారిణీ పాతు హృదయం విష్ణువల్లభా*
*పుణ్యదా పాతు మే మధ్యం నాభిం సౌభాగ్యదాయినీ*
*కటికుండలినీ పాతు ఊరూ నారద వందితా"*





'శుభదా–నా నాలుకను కాపాడుము. విద్యామయీ–నా కంఠమును కాపాడుము. కల్హారిణీ–నాభుజమును, ఓ విష్ణువల్లభా–నా హృదయమును, ఓ పుణ్యదా నా మధ్యభాగమును, ఓ సౌభాగ్యదాయినీ నా నాభిని, ఓ కుండలినీ,–నా నడుమునూ, ఓ నారదవందితా–నా తొడలను రక్షింపుము'.

*"జననీ జాను నీ పాతు జంఘే సకల వందితా*
*నారాయణప్రియా పాదౌ సర్వాంగం సర్వరక్షిణీ*
*సంకటే విషమే దుర్గే భయే వాదే మహాహవే*
*నిత్యే సాధ్వ్యోః పాతు తులసీ సర్వదా సదా"*

'ఓ జననీ–నా ధాతువులను, ఓ సకల వందితా–నా జంఘములను, ఓ నారాయణ ప్రియా–నా పాదములను, ఓ సర్వరక్షణీ –నా సర్వాంగములను రక్షింపుము. ఓ దుర్గా ! ఓ మహాదేవా ! అన్ని సంకటముల నుండియు, ఓ మహాదేవా ! అన్ని భయముల నుండి, శత్రువుల నుండి కాపాడుము. ఓ సంధ్యా రూపిణీ ! ఎల్లప్పుడు రక్షించుచుండుము. తులసీదేవి, మాకు శుభముల నిచ్చుగాక'.





*"ఇతీదం వరమంగుహ్యంతులస్యాకవచామృతం*
*మృత్యోరమృతార్థాయ భీతానామభయాయ చ*
*మోక్షాయచముముక్షూణాం ధ్యానినాం ధ్యానయోగకృత్*
*పశాయ విశ్వకామానం విద్యావై వేదవాదినామ్"*

'ఈ తులసి కవచం చాలా గూఢమైనది. మరణాసన్నమైనవాడు మృత్యువు నుండి, భయముతోనున్నవాడు భయమునుండి, రక్షింపబడును. మోక్షార్థులకు ముక్తి గూడా కలుగును. యోగాభిలాషులకు ధ్యానము నందు దృఢత కలుగును. సంసారులకు కోరిన కోరిక నెరవేరును. జ్ఞానులకు జ్ఞానము లభించును'.

*"ద్రవిణాం దరిద్రాణాం పాపినాం, పాప శాంతయే*
*అన్నాయ క్షుధితానాం చ స్వర్గమిచ్ఛతాం*
*భక్త్యంర్థం విష్ణు భక్తానాం విష్ణో సర్వాంతరాత్మని*
*జాప్యం త్రివర్గ సిద్ధ్యర్థం గృహస్థేన విశేషతః"*

దీన దరిద్రులకు–సంపత్తి, దుష్కర్ములకు–పాపకర్మల నుండి విముక్తి–అన్నార్తులకు అన్నము, స్వర్గాభిలాషులకు–భక్తితత్పరులకు–సర్వాంతర్యామియైన విష్ణుభక్తి, గృహస్థులకు–త్రివర్గప్రాప్తికలుగును.





ఈ కవచము స్తోత్రరూపమున ఉన్నప్పటికీ దీనిని శ్రద్ధతోను. తన్మయత్వముతోను చదివి, ఇందు తెలిపిన శారీరిక మానసిక ఉన్నతులను ప్రయత్న పూర్వకముగా మనస్సునందు నిలిపినచో, వాటి ప్రభావము మన శారీరిక మానసిక ప్రవృత్తులపై పడి, మేలును కలుగచేయును. దానివలన సాంసారిక విషయము లందు జీవన నిర్వహణమునందు మంచి ప్రభావము కలుగును. ఇందలి అర్థమును గ్రహించుచు పఠించిన, ఎక్కువ ఫలితము కలుగును.

## తులసీ ప్రదక్షిణ స్తోత్రం

*శ్లో ॥ యన్మూలే సర్వతీర్థాని ।*
*యన్మధ్యే సర్వదేవతాః ।*
*యదగ్రే సర్వవేదాశ్చ*
*తులసీం త్వాం నమామ్యహమ్ ॥*

తా. మూలమున సర్వతీర్థములు, మధ్యన సర్వదేవతలు, చివరన సర్వ వేదములు గల తులసి చెట్టుకు మ్రొక్కుచున్నాను.